# వేనెపూలి

కొమ్మూరి రవికిరణ్



''ఏమిటివ్వాళ త్వరగానే వచ్చారు?'' రోజులా కాకుండా చాలా పెందలాడే ఇంటికి వచ్చిన భర్తని ఒకింత సంతోషంతో అడిగింది భారతి.

''అంటే... ఇంటికి తొందరగా రావడం కూడా తప్పేనా?'' చిరాగ్గా అడిగాడు మురళి. అతని ముఖం కాస్త కంగారుగా వుంది.


చిన్నబోయింది భారతి వెంటనే తేరుకొని ''అలసటగా వున్నారు. కాఫీ తీసుకురానా?'' అడిగింది.

''మాట్లాడకు'' కసురుకొని బెడ్‌రూంలోకి వెళ్లి తువ్వాలు తీసుకొని బాత్‌రూంలోకి వెళ్లాడు మురళి.

## టేకుల మీద టేకులు తిన్న దీపికా పదుకొనే

ఎంత మహానటి అయినా బాయ్ ఫ్రెండ్ ముందు హీరోతో ప్రేమ సన్నివేశాలలో క్లోజ్‌గా నటించాలంటే కొద్దిగా అసౌకర్యంగానే కాదు ఇబ్బందిగా కూడా ఫీలవుతుంది. ఈ ఫీలింగుకి బాలీవుడ్ హీరోయిన్ దీపికా పదుకొనే ఏమాత్రం మినహాయింపు కాదు.

దీపికా బాయ్‌ఫ్రెండ్ రణబీర్ కపూర్ ఇటీవల ఒక ఫోటో సెషన్ కోసం బ్యాంకాక్ వెళ్లాడు. అక్కడ దీపికా, అక్షయ్‌కుమార్ కలిసి నటిస్తున్న 'అవుర్ ఖబ్రూ' షూటింగ్ జరుగుతోంది. షూటింగ్ జరుగుతున్న సెట్స్ సమీపంలోనే రణబీర్ ఫోటో సెషన్ వుండడంతో షూటింగ్ దగ్గరకు సరదాగా వచ్చి దీపిక ఎలా నటిస్తోందో గమనించసాగాడు. మానిటర్ దగ్గర కూర్చుని క్లోజప్‌లో దీపిక ఫీలింగ్స్‌ను పరిశీలించసాగాడు. ఇంత వరకూ బాగానే వుంది. కథలో భాగంగా ఒక రొమాన్స్ సన్నివేశంలో అక్షయ్‌కుమార్‌తో సహజంగా నటించాల్సి రావడంతో దీపిక ఇబ్బందులు మొదలయ్యాయి. రణబీర్ ముందు అక్షయ్‌కుమార్‌తో సహజంగా నటించడానికి తెగ మొహమాటపడిపోయి టేకుల మీద టేకులు తీసుకుందట. ప్రతి షాట్‌కీ రణబీర్ దగ్గరకి వచ్చి సన్నివేశం గురించి డీప్‌గా డిస్కస్ చేసేదిట. రొమాన్స్ సన్నివేశంలో సహజంగా నటించడానికి దీపిక ఇబ్బంది పడినా అది నటనలో భాగమే కాబట్టి రణబీర్ దానిని తేలిగ్గా తీసుకొని ఎంజాయ్ చేశాడట!



అర్థమైంది భారతికి. భర్త ఇంత విసుగ్గా వున్నాడంటే తనంతట తాను మళ్లీ మామూలు మూడ్‌లోకి వస్తేనే గాని సరిగ్గా వుండడు. తను ఇప్పుడు ఏం మాట్లాడినా అతని చిరాకు రెట్టింపే అవుతుంది.

ఇప్పుడా....? పెళ్లయిన దగ్గర్నుంచి చూస్తోంది. బాధగా నిట్టూర్చింది.

కాసేపటికి బాత్‌రూంలోంచి బయటకు వచ్చి నైట్ డ్రస్ వేసుకొని హాల్లోకి వచ్చి అన్నాడు మురళి. ''నా కోసం చూడకుండా భోజనం చేసేయ్. తర్వాత నేను పెట్టుకు తింటాను. నన్ను డిస్టర్బ్ చేయొద్దు. అవునూ బాబేడి?''

''పై వాళ్లింట్లో ఆడుకుంటున్నాడు'' అంది భారతి.

''సరే వాడ్ని కూడా డిస్టర్బ్ చేయొద్దని చెప్పు'' అని వేరే గదిలోకి వెళ్లి తలుపేసుకున్నాడు.

ఆ గదిలో కంప్యూటర్ వుంది. మురళి కంప్యూటర్ ఆన్ చేసి నెట్‌లోకి వెళ్లి ఒర్‌కుట్ ఓపెన్ చేశాడు. అతని ముఖం ఆతృతగా వుంది.

ఓపెన్ అయిన తర్వాత తనకేమైనా మెసేజెస్ వచ్చాయేమో చూశాడు.

అతను మూడు రోజుల క్రితం ఒర్‌కుట్‌లో తన ఫోటో, వివరాల్ని పెట్టాడు. అతనికి వున్నట్లుండి తన చిన్ననాటి స్నేహితులని కలవాలనిపించింది. స్నేహితుల కన్నా స్నేహితురాలనడం బావుంటుంది. కేవలం ఒక మనిషి కోసం అదీ ఆమె అతని ప్రియనేస్తం, నెచ్చెలి, పేరు వ....

తనకేవో కొన్ని మెయిల్స్ వచ్చినట్లు గమనించాడు మురళి. అదిమిపెట్టుకున్న వుత్సుకతతో ఒక్కొక్కటి చూడసాగాడు. 'ఎవడో తెలిసిన మొహంలా వుందే' అని చదివాడు. ''అరేయ్ మురళి నేన్రా నారిగాడ్ని'' అన్న మెసేజ్ చూశాడు. నారిగాడు అదే నారాయణ.

''ఏరా బావున్నావా? ఎన్నాళ్లయిందిరా నిన్ను చూసి? నేనిప్పుడు న్యూయార్క్‌లో ఒక హోటల్ నడుపుతున్నాను...'' క్లాస్‌లో లాస్ట్ ర్యాంకు వచ్చే చింతపండు నారిగాడు ఎంత ఎదిగిపోయాడు. వాడు ఈ స్థాయికి వస్తాడని ఎవ్వరూ వూహించలేదు.

తర్వాతది చూశాడు.

''ఏరా ముళ్లి బావున్నావా?''

''ఎవడు?'' శ్రద్ధగా చూశాడు. కన్నారావు!

సమస్య లేదు వాడే.. వాడికి ఇప్పటికీ తన పేరు సరిగ్గా పలకడం రాలేదన్నమాట. నవ్వుకున్నాడు. కన్నారావు మంచి పొజిషన్‌లో వున్నందుకు చాలా ఆనందించాడు.

వీళ్లకి తీరిగ్గా మెయిల్స్ ఇవ్వాలి అనుకుంటూ తాజాగా వచ్చిన మెయిల్స్‌ని చూడసాగాడు. జానకి, పద్మ, విశాలి, రెడ్డి.... ఆశ్చర్యపోయాడు మురళి. తను సరదాగా తన ప్రొఫైల్‌ని పెడితే బాగానే రెస్పాన్స్ వచ్చింది. ఫర్వాలేదు. తన చిన్ననాటి స్నేహితులు ఇంకా గుర్తుంచుకున్నారు.

అవును మరి మర్చిపోయే రోజులా అవి?

కాని మురళి తనకి కావాల్సిన వ్యక్తి దగ్గర్నుంచి ఎదురు చూస్తున్నాడు. అసలు ఆమె కోసమే.. ఇదంతా...

ఒక్కొక్కటి చూస్తున్న మురళి ఆగిపోయాడు. వూపిరి పీల్చుకోవడం మరిచిపోయాడు. వణుకుతున్న గొంతుతో పైకే చదివాడు ''మనసే అందాల బృందావనం...''

సంభ్రమాశ్చర్యాలతో కేకపెట్టాడు మురళి. తను చూస్తున్నది నిజమా? ఎస్...తనే....తనే.. తన అందమైన గతం. తన ప్రియబాంధవి వనమాలి.

వనమాలి ఏం పంపిందో చూడసాగాడు.

మురళి,

ఇవ్వాళ నా జీవితంలో చాలా ఆనందకరమైన రోజు. మొదట నీ పేరు కన్నా నీ ఫోటో చూశాను. ఒక్కసారి గుండె ఝల్లుమందంటే నమ్ము. నా మురళేనా అనిపించింది. అప్పుడు లేత బుగ్గలతో ఎంతందంగా వుండేవాడివో! ఇప్పుడు వయస్సు తెచ్చిన గాంభీర్యంతో అంతే హుందాగా వున్నావు. సంతోషం వేసింది. ప్రస్తుతం నేను కెనడాలో వున్నాను. మనసంతా వుక్కిరిబిక్కిరిగా వుంది. అందుకే ఏం రాయాలో అర్థం కావడం లేదు. కలవక కలవక కలిశావు. నిన్ను వదులుతానా? చాలా కాలం తర్వాత నేను పోగొట్టుకున్నది దొరికింది. అపురూపంగా చూసుకోవాలి. మళ్లీ జారిపోతుందేమోనని భయం. ఇది చూసిన వెంటనే మెయిల్

ఇమ్మని బ్రతిమాలుకుంటున్నాను.

నీ

వనమాలి.

మళ్లీ మళ్లీ చదివాడు. 'మనసే అందాల బృందావనం...' థ్రిల్ అయిపోయాడు మురళి. అంటే... వనమాలికి ఇంకా ఆ పాట గుర్తుందన్న మాట.

తనకి వీలయినప్పుడు ఆ పాట పాడించుకునేవాడు ఆమెతో. ఎంత అద్భుతంగా పాడేది.

ఒకరు లేకపోతే ఒకరు లేరనుకున్న ఆ రోజుల్ని తలచుకొని పులకరించిపోయాడు. అతనింకా ఉద్విగ్నతకి లోనవుతున్న విషయం వనమాలి తనని ఇంకా అలాగే ప్రేమిస్తూ వుండడం.

ఒంట్లో వేడిగా రక్తం ప్రవహించసాగింది.

ఇంకొకసారి మళ్లీ చదువుకున్నాడు. వనమాలి తన ప్రొఫైల్ పంపించలేదేంటి? ఒకసారి ఆమెను చూడాలనిపించింది.

వెంటనే రిప్లయ్ ఇవ్వసాగాడు ఆమెకి. ఏమని రాయాలి? కాస్సేపు ఆలోచించాడు. అతని వయసు హటాత్తుగా చిన్నదయిపోయింది. గుర్తొచ్చింది మురళికి ఉత్సాహం వచ్చింది.

సుప్రభాత సుందరికి... అని మొదలుపెట్టాడు. తను ఇన్నాళ్లు ఏం చేసింది? ఆమెని వదులుకున్న తర్వాత తను భరించిన వేదన, చాలా కాలం తర్వాత కొంత మర్చిపోయి పెళ్లి, ఒక బాబు అని రాసాడు గాని భారతి గురించి ఏం రాయాలో అర్థం కాలేదు.

టైమ్ చూసుకున్నాడు. పదిన్నర అయ్యింది.

కంప్యూటర్ ఆఫ్ చేశాడు. డైనింగ్ టేబుల్ దగ్గరకు వెళ్లి అన్నం పెట్టుకుని తిన్నాడు. అన్ని సర్దేసి బెడ్‌రూమ్‌లోకి వెళ్లి లైట్ వేశాడు. మంచి నిద్రలో వున్న భారతి వెలుగుకి కళ్లు చిట్లించి ఇటు తిరిగి పడుకుంది పక్కనే బాబు.

నిద్రపోతున్న భారతి, బాబు ముఖాలు చాలా అమాయకంగా కనపడ్డాయి. అకస్మాత్తుగా జాలి ముంచుకొచ్చింది. మనసు మెలిపెట్టినట్లయ్యింది. తన పెళ్లయిన దగ్గర్నుంచి ఒక నెల బాగా సంపాదించిన రోజులున్నాయి. ఒక నెల ఏమీ సంపాదన లేని రోజులున్నాయి. తన వ్యాపారం అటువంటిది. అయినా సరే, వున్న రోజుల్లో పొంగిపోయి లేని రోజుల్లో కృంగిపోయి గొడవ చెయ్యలేదు. భారతి మెంటల్ బ్యాలెన్స్ చూస్తే అతనికే చాలా ఆశ్చర్యమేస్తుంది ఒక్కోసారి. తనని ఎంతో గారాబంగా చూసుకుంటుంది అలాంటిది తను ఎందుకో వనమాలిని మర్చిపోలేకపోయాడు. తనకి ఇంకా వనమాలి కావాలనిపిస్తోంది. ఎందుకు? తను.. తను.. భారతిని మనస్ఫూర్తిగా ప్రేమించలేకపోతున్నాడా? గగుర్పొడిచింది మురళి శరీరం.

తనకి పెళ్లయ్యింది. వనమాలికి కూడా పెళ్లయి వుంటుంది. అయినా ఇంకా వనమాలి నుంచి ఏదో ఆశిస్తున్నాడంటే...? తను తప్పు చేస్తున్నాడు. తనకి తెలుసు. అయినా మనసుని అదుపులో పెట్టుకోలేకపోతున్నాడు. అందుకే భారతి మీద అర్థం లేని కోపాలు, చికాకులు. ఇందాక ఇంటికి రాగానే భారతి మీద ప్రదర్శించిన అర్థం లేని విసుగుకి తన మీద తనకే అసహ్యం వేసింది మురళికి.

''లైటు తియ్యండి... ప్లీజ్...'' బద్ధకంగా అంది భారతి.

అంతులేని ఆపేక్ష ముంచుకురాగా లైటు తీసేసి భార్య పక్కనే పడుకొని, ఆమె మెడ వంపులో తలదాచుకున్నాడు. నిద్రలో వున్న భారతి కొంచెం కదిలి, భర్త తల మీద చెయ్యి వేసి నిమురుతూ మరింత దగ్గరకు తీసుకొంది.

★ ★ ★

''హ్యాపీ బర్త్‌డే టు యూ డాడీ''

మత్తుగా కళ్లు తెరిచాడు మురళి. నవ్వుతూ విషెస్ చెబుతున్న కొడుకుని గట్టిగా ముద్దుపెట్టుకొని ''హ్యాపీ బర్త్‌డే టు యు నాన్నా'' అన్నాడు. తమిద్దరి పుట్టినరోజు ఒకటే తేది. భారతి లోపలికి వచ్చింది. అప్పుడే స్నానం చేసినట్లుంది. ఇద్దరినీ ముద్దుపెట్టుకుని విషెస్ చెప్పి ''ఇవ్వాళ కూడా త్వరగా వచ్చేయండి. బాబుని బయటకు తీసుకెళదాం'' అంది.

హుషారుగా పక్క మీద నుంచి లేచాడు. రాత్రి పడిన మనోవ్యథ ఇప్పుడు లేదు. స్నానం చేస్తున్నప్పుడు అనుకున్నాడు 'ఒకసారి వనమాలితో మాట్లాడితే బావుండు'

బయట భారతి గొంతు వినపడింది. బాబుతో అంటోంది. ''రాత్రేగా చెప్పాను. అన్నేసి చాక్లెట్లు తినకూడదని. పొద్దున్నే మళ్లీ మామూలే. పళ్లు పాడయిపోతాయి నాన్నా'' సున్నితంగా మందలిస్తోంది.

★ ★ ★

''మురళీ...

మెనీ హ్యాపీ రిటర్న్స్ ఆఫ్ ది డే'' చూశావా? నాకెంత గుర్తో? ఆశ్చర్యంగా వుందా? నీతో గడిపిన ప్రతి క్షణం మదిలో పదిలంగా వుంది. అన్నట్లు మా అబ్బాయి పుట్టినరోజు కూడా ఇవ్వాళే తెలుసా? నా డెలివరీ రోజులు దగ్గరపడ్తున్నాయి. ఇంకా నాలుగు రోజులు ఆగితే నాచురల్‌గా అయిపోతుంది అన్నారు డాక్టర్లు. అయినా పట్టుపట్టి ముందుగానే సిజేరియన్ చేయించుకున్నాను. ఎందుకో నీకు అర్థమై వుంటుంది. ఆ రకంగా నువ్వు ఎప్పుడూ నా దగ్గరే వున్న అనుభూతి. గమ్మత్తుగా వుంటుంది. అంత ఆరాధన నువ్వంటే.

ఒక రోజు నువ్వు, నేనూ తోటలో వున్నాం. ఎందుకో నా పాదం నీ అరచేతి మీద పడింది. నీ అరచేతి మీద నా మట్టి పాదం ముద్ర. అప్పుడు నువ్వు ఏం చేశావో తెలుసా? అలాగే ఇంటికి వెళ్లి చేయి కడుక్కోకుండా అన్నం తినేశావ్. అదేమని అడిగితే నిన్ను నాలో కలుపుకున్నానన్నావ్. అది గుర్తొచ్చినప్పుడల్లా ఇప్పటికీ, ఏదో గిలిగింత. ఇలా ఎన్నో... ఎన్నెన్నో... మిగతావి తర్వాత.

చదువుతున్న మురళి తనెక్కడ వున్నాడో మరిచిపోయాడు. తనకోసం ఇంకో హృదయం ఎక్కడో తపిస్తోంది. గర్వంగా అనిపించింది మురళికి. వెంటనే ఆమెకు మెయిల్ ఇవ్వడానికి ఉద్యుక్తుడయ్యాడు. తలుపు చప్పుడయితే చూశాడు భారతి.

''మీరు మర్చిపోయినట్లున్నారు బాబుని బయటకు తీసుకు వెళదామనుకున్నాము'' పరవశించిపోతూ తేలియాడుతున్న మురళికి భారతి మాటలు చెప్పలేనంత కోపం తెప్పించాయి.

''ఇవ్వాళే వెళ్లాలని రూలుందా? నోర్మూసుకొని వెళ్లు..'' కస్సుమన్నాడు. బిత్తరపోయి ''అది కాదండి....''

''వెళ్లమన్నానా? బయటకు తీసుకెళ్లి నువ్వే ఏదో కొనిపెట్టు'' పిచ్చి కోపంగా అరిచాడు.

తలదించుకొని మౌనంగా పక్కకి వచ్చేసింది భారతి.

''ఛీ...మూడ్ పాడు చేసేసింది'' చాలాసేపు కళ్లు మూసుకొని కూర్చుని, తర్వాత వనమాలికి మెయిల్ ఇచ్చాడు.

''థాంక్యూ వెరీమచ్. నన్ను మరిపోనందుకు. నీ అంత బాగా చెప్పడం రాదు గాని ఇన్నాళ్లు అందరూ వున్నా, అన్నీ వున్నా ఏదో వెలితి. అది ఏమిటో ఇవ్వాళ్లే తెలిసింది. ఈ రోజే తీరింది. నిన్ను చూడాలని వుంది. నీ గొంతు వినాలని వుంది. నీ ఫోన్ నెంబర్ పంపించు చేస్తాను. భారతి, బాబు గురించి ఏమైనా చెప్పాలి అనుకుని, అసలే కొంచెం భారతి మీద కోపంగా వున్నాడేమో, బాబు గురించి మాత్రం కొంత పంపించాడు. చివరకు 'ఒక్క మాట అడుగుతాను. ఏమీ అనుకోవుగా? నన్ను మరిచిపోలేదన్నావు? ఎలాంటి సందర్భాల్లో ఎక్కువగా గుర్తొస్తాను నేను. ఇది మాత్రం చెప్పాలి' అని సందేహిస్తూనే ఇంకో ప్రశ్న వేశాడు. 'మీ వారు నిన్ను బాగా చూసుకుంటారా?' అని ముగించాడు.

టైమ్ చూసుకున్నాడు. చాలా రాత్రయ్యింది. అప్పుడు తెప్పరిల్లాడు ''అరెరె...'' సిగ్గుతో త్వరగా బెడ్‌రూమ్‌లోకి వెళ్లాడు. భారతిని గట్టిగా పట్టుకొని పడుకున్నాడు బాబు. అలా చూసేసరికి అప్రయత్నంగా కళ్లలో నీళ్లు తిరిగాయి మురళికి.

''సారీ...సారీ...రా''అంటూ బాబుని పదే పదే ముద్దులు పెట్టుకోసాగాడు. భారతిని చూశాడు ప్రశాంతంగా నిద్రపోతోంది. తన మీద తనకే వెగటు పుట్టింది మురళికి. ''ఛీ... తనకేమైంది? ఎంత దారుణంగా అసహ్యించుకున్నాడు. తను చేసేదే తప్పు. మరింకేం అర్హత వుందని భారతిని దూషిస్తున్నాడు? మథన పడిపోసాగాడు. మురళికి దుఃఖం తెరలుగా రాసాగింది. ఏమౌతోంది తనకు?''

''ఏం జరుగుతోందో నాకు తెలుసు'' అంది భారతి కళ్లు తెరిచి.

ఉలిక్కిపడి తలెత్తి ''ఏం జరుగుతోంది?'' తడబడుతూ అడిగాడు.

''అంతర్మథనం. ముందూ వెనుకా చూడకుండా అనేస్తారు. తర్వాత బాధపడిపోతారు.

పాపం బాబు ఇప్పటిదాకా ఏడ్చి పడుకున్నాడు. మీరు చాలా డిజప్పాయింట్ చేశారు వాడిని.''

''సారీ...సారీ..''

''పడుకోండి''

మురళి భారతి పక్కకి చేరి ''నిజంగా సారీ.... నిన్ను... నిన్ను....''

నవ్వుతూ అంది భారతి ''ఇందాకట్నించి మీరు పడుతున్న వేదన చూస్తున్నాను.''

''ఏం చెయ్యమంటావ్?''

కొంచెం పెద్దగా నవ్వి అంది భారతి ''తెలివైన వాడు జరిగిపోయిన దాని గురించి ఆలోచించడు. మిగిలిన దాన్ని ఎలా సద్వినియోగం చేసుకోవాలో ఆలోచిస్తాడు.''

ఫ్లాష్‌లాగా భారతి చెప్పింది అర్థమై, ఆమె మీదకు ఒరిగాడు. కొన్ని రాత్రులు సంతోషంగా వున్నప్పటికన్నా దుఃఖంలో వున్నప్పుడే అద్భుతంగా గడుస్తాయి.

★ ★ ★

ఉదయం లేచిన దగ్గర్నుంచి బాబుని, భారతిని సూటిగా చూడలేకపోయాడు. అపరాధభావం అతన్ని తొలిచేస్తోంది. భారతి అతన్నే గమనిస్తోంది. నవ్వుకుంది. కానీ ఏం మాట్లాడలేదు. ఆ రోజు సాయంత్రం కూడా త్వరగానే ఇంటికి వచ్చాడు మురళి. వస్తూనే గదిలోకి వెళ్లి తలుపులేసుకొని కంప్యూటర్ ఆన్ చేశాడు. కాసేపటికి వనమాలి మెయిల్ చదవసాగాడు.

మురళీ, నువ్వు పంపించింది చదివి చాలా సేపు నవ్వుకున్నాను. గుర్తుకొస్తావ్. నిజానికి రోజూ, నిరంతరం. నా భర్త నన్ను తాకిన ప్రతీసారీ. ఆయన నా మీద చెయ్యి చేసుకున్నప్పుడు మరీ. అదే నీతోనే వుంటే ఇలాంటివి వుండేవా? భారతిని తలుచుకుంటే బాగా జెలసీగా వుంటోంది. నేను అనుభవించాల్సిన అదృష్టం ఆమెని వరించింది. గాజు బొమ్మని చూసుకుంటున్నట్లు చూసుకుంటావు ఆమెని. నాకెలా తెలుసునా? నీ మనస్తత్వం తెలియదా? నీ సున్నితమైన మనసే అప్పుడు నాకు బాగా నచ్చేది.

మురళీ, అందుకే నిన్ను ఇంకా ప్రేమిస్తున్నది. నువ్వు మారలేదుగా? నువ్వు నువ్వుగానే వుండు. దయచేసి మారకు. అదే నీకు పెద్ద పెట్టుబడి. కట్టుకున్న మగవాడు మారిపోతే ఏ భార్యా భరించలేదు. అది నేనైనా కావచ్చు. భారతి అయినా కావచ్చు. ఇంకెవరైనా సరే, ప్రేమ, ఇష్టం అవి కూడా వయసుతో పాటు పెరగాలే గాని తగ్గిపోకూడదు. నేను నీకు ఎదురుపడకపోవచ్చు. కానీ నా అంతరాత్మ అనుక్షణం నీ గురించే తపిస్తుంటుంది. నా ప్రేమని నీకు అందిస్తాను. నువ్వు జీవితంలో విజృంభించాలి. ఎప్పుడయినా మనం కలిస్తే, జీవితంలో చాలా సాధించేసిన ధీరోదాత్తుడిలాగా వుండాలి. నీ నుంచి కోరుకునేది అదే.''

చదివి భారంగా వూపిరి పీల్చాడు మురళి. ఒక విధమైన రిలాక్సేషన్ వచ్చింది అతని ముఖంలో. వనమాలి ప్రేమను పూర్తిగా పొందడం వలన కావచ్చు. భారతిని మోసం చెయ్యట్లేదు అన్న రిలీఫ్ వల్ల కావచ్చు. అతని ముఖంలో వింత కాంతి కనపడసాగింది.

★ ★ ★

బాబు స్కూలుకి, మురళి బయటకు వెళ్లిన తర్వాత పనులన్నీ ముగించుకొని గదిలోకి వచ్చి కంప్యూటర్ ఆన్ చేసింది. అంతకు ముందు రోజు కూడా మురళి ఇచ్చిన మెయిల్ చూసి నవ్వుకుని, అతనికి తిరిగి మెయిల్ ఇవ్వసాగింది.

మురళీ,

చాలా సంతోషంగా వుంది ఇవాళ. నువ్వు పంపిస్తున్న మెయిల్స్‌లో అద్భుతమైన మార్పు కనపడింది. మొదట్లో నీ మాటల్లో ఏదో దిగులు, వైరాగ్యం కనపడేది. జీవితంలో బాగా ఎదగాలనుకునే వ్యక్తికి వుండకూడనివి అవి. కాని ఇప్పుడవి లేవు. దానికి కారణం నేనే అనుకుంటే నాకెంత గర్వంగా వుందో తెలుసా? కొండంత.

వనమాలి.

వెనకాల అలికిడయితే చప్పున తిరిగింది భారతి. ఆమె స్నేహితురాలు విజయ నిలబడి వుంది.

''హమ్మ....హడలి చచ్చాను కదే రాక్షసి?'' కోపంగా అంది భారతి.

విజయ నవ్వి, ''నువ్వు కాదు నేను హడలి ఛస్తున్నాను. నువ్వేనా ఇలా తయారయ్యింది. ఎవరికే?'' కాస్త అనుమానంగా అడిగింది.

''పిచ్చి పిచ్చిగా ఆలోచించకు. నేను పంపించేది నా భర్తకే'' మెల్లిగా అంది.

షాకయ్యి ''మరి ఈ వనమాలి ఎవరు?'' అర్థం కాక అడిగింది విజయ.

''ఎవ్వరూ లేరు''

''ఎవరూ లేరా?'' ఆశ్చర్యంగా అడిగింది.

స్నేహితురాలి చెయ్యి పట్టుకొని ఇంకో కుర్చీలో కూర్చోబెట్టి చెప్పింది. ''వనమాలి వుంది కానీ ఇప్పుడు కాదు. ఆమె ఒకప్పుడు నా భర్తతో కలిసి చదివింది. ఆమె ఆయనకి ఆరాధ్య దేవత.''

అయోమయంగా చూసి ''మరి ఏమిటే ఇదంతా? ఎవరికోసం చేస్తున్నావ్ ఇదంతా?''

నవ్వుతూ చెప్పసాగింది భారతి. ''నా జీవితం కోసం చేస్తున్నా ఇదంతా. నా సంసారాన్ని రక్షించుకోవడానికి చేస్తున్నా.''

అర్థం కానట్టు చూసింది విజయ.

నిదానంగా చెప్పసాగింది భారతి. ''నిజానికి మా ఆయన చాలా మంచివాడే విజయ. కానీ ఆయనది సున్నితత్వమో, రాక్షసత్వమో ఆయనకే తెలీదు. ఎప్పుడు అసహనంగా వుంటారు. అసలు ఆయనకి ఏం కావాలో ఆయనకే తెలీదు. పెళ్లయిన దగ్గర్నుంచి చూస్తున్నాను. నన్ను గుండెల్లో పెట్టుకొని చూసుకొంటారు. ఒక భర్త నిర్వర్తించాల్సిన బాధ్యతలన్నీ తీసుకుంటారు. కానీ ఎప్పుడూ ఏదో అసంతృప్తి. ఆ అసంతృప్తి విజృంభిస్తున్నప్పుడల్లా ఆయన మామూలుగా వుండరు. అంతా కోల్పోయినట్లు వుంటారు. ఇలాగే కొనసాగితే సంసారం కష్టం. నాకు, బాబుకీ, బిజినెస్‌కి అంతా కష్టమే.

ఆయన మామూలుగా వుంటే, బిజినెస్‌లో అద్భుతాలు చేస్తారు. కానీ, ప్రతి చిన్న విషయానికీ కూడా కంట్రోల్ తప్పుతారు. అనవసరంగా వున్న మంచి అర్హతలన్నీ పోగొట్టుకుంటున్నారు. నా పెళ్లయిన సంవత్సరం వరకూ అందరూ ఉమ్మడిగా వుండేవారు. ఆస్తి తగాదాల వల్ల వేరయిపోయారు. ఇప్పుడు ఒంటరిగా వుండలేకపోతున్నారు. అన్నదమ్ములు, అక్క చెల్లెళ్లతో మనసు విప్పి మాట్లాడుకునే పరిస్థితి లేదు. దాంతో అభద్రతా భావం వచ్చేసింది. నేను ఎంత ధైర్యం చెప్పినా, ఎంత మమకారం చూపించినా ఆయనకు సరిపోవట్లేదు. రోజు రోజుకీ మరీ దిగులుగా తయారవుతున్నారు. ఎవరితోనైనా కౌన్సిలింగ్ చేయిద్దామనుకున్నాను. ఇన్నాళ్లు కాపురం చేసి నా భర్తని నేనే ఎందుకు మార్చుకోకూడదు? భార్యగా ఆ మాత్రం చెయ్యలేకపోతే నేనెందుకు?

అలా ఆలోచిస్తుంటే అనుకోకుండా ఆయనే పాత స్నేహితుల కోసం మెసేజ్ పెట్టడం గమనించాను. అప్పుడు తట్టింది వనమాలి నాకు. పెళ్లయిన కొత్తల్లో వనమాలి గురించి తెగ చెప్పేవారు. ఆయన్ని మార్చడానికి వనమాలిని వుపయోగించుకుంటే ఎలా వుంటుంది? అని ఆలోచించాను. ఆమె ఎవరో, ఎక్కడ వుంటుందో తెలీదు. ఇక నేనే వనమాలి పాత్ర ధరించాను.''

విస్మయంగా వింటోంది విజయ. థ్రిల్లింగ్‌గా వుంది. ''భర్తని మార్చడానికి బాగానే రిస్క్ తీసుకున్నావ్. కానీ ఎప్పుడైనా నిజంగా వనమాలి ఎదురైతే?'' అడిగింది.

భుజాలు ఎగరేసి చెప్పింది భారతి ''చెప్పలేం. పరిస్థితి అంతవరకూ వస్తుందని నేననుకోను. చూద్దాం.''

విజయ నవ్వి ''అయితే ఒక రకంగా నీ సవతిని నువ్వే ఏర్పాటు చేసుకున్నావన్నమాట.''

''తప్పులేదు. అయినా నాకేం భయం లేదు. నా భర్త సంగతి నాకు తెలుసు. ఎప్పటికప్పుడు ఆత్మ విమర్శ చేసుకునేవాడు నమ్ముకున్న వాళ్లకి ద్రోహం చెయ్యలేడు. ఎందుకంటే ఆయన భార్యగా తన బలం ఏమిటో, బలహీనత ఏమిటో నాకు బాగా తెలుసు. ఎనీవే వనమాలికి థ్యాంక్స్ చెప్పాలి.''

అంతా విని ఆనందంగా విజయ ''కంగ్రాట్స్. సాధించావ్. ఇంతకీ మురళి బలం ఏమిటి? బలహీనత ఏమిటి?'' ఆసక్తిగా అడిగింది.

''ఆయన బలం, బలహీనత రెండూ ప్రేమే.''

''అంటే'' అర్థం కాక అడిగింది విజయ.

భారతి నవ్వి చెప్పింది ''ఆయన ప్రేమించడం కన్నా ప్రేమించబడడానికి ఇష్టపడతారు.''

★